

## 'ప్రజాశక్తి' వార్తకు స్పందన....

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

'చిట్టి చేతులు.... చెత్త సంచులు' అనే శీర్షికన 'ప్రజాశక్తి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు జిల్లా ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ ప్రాంతంలో పిల్లలను గుర్తించి వారిని అంగన్వాడీ కేంద్రానికి పంపేట్లు తల్లిదండ్రులకు సూచించారు. దీంతో మంగళవారం తిరుమల నగర్ అంగన్వాడి టీచర్ పుష్ప పిల్లలు నివాసముండే ఇంటికి వెళ్లి వారిని తయారుచేసి అంగన్వాడీ కేంద్రానికి తీసుకొని వెళ్లారు.

అంగన్వాడీ కేంద్రానికి వెళ్తున్న చిన్నారులు

## విద్యా దీవెన బిల్లులు విడుదల చేయండి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, యంత్రాంగం**

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, పుత్తూరు, చంద్రగిరిల్లో నిరసన తెలిపారు. తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గురవయ్య మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన బిల్లులు రూ.3480 కోట్ల మేర పేరుకుపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. తల్లికి వందనం పథకం సొమ్ము ఎప్పుడు అమ్మల ఖాతాల్లో జమవుతాయో తెలియకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. డిగ్రీ విద్యలో మేజర్, మైనర్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరచాలని కోరారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని సూచించారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలనీ, మెస్ చార్జీలు నెలకు రూ.3 వేలివ్వాలని కోరారు. జీవో నెం.77 రద్దు పరచి పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రియంబర్స్ మెంట్ వర్తింపజేయాలని సూచించారు. మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయరాదనీ, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు పరచాలని డిమాండ్ చేశారు. డేవిడ్, నాగరాజు, గంగాధర్, శ్యామ్, భువనేష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో...

# భక్తి ఉద్యమంతో కళలను కాపాడుకుందాం..!

## 'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్ర సదస్సులో ఉద్ఘాటన

**ప్రజాశక్తి - తిరుపతి సిటి** 'జానపద కళలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కళాకారులు చేయిచేయి కలిపి కళలను కాపాడుకునేందుకు కంకణబద్దులు కావాలి' అని వక్తలు ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట విద్వేషాలు మాని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి ఆధ్వర్యంలో 'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్రస్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఈ సభకు జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంక్రాంతి వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

### సమానత్వాన్ని చాటుదాం

**మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ**

మతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం కాదు. సమానత్వాన్ని పెంపొందించాలి. దేవుని ముందు అందరూ సమానమే. వ్యాపారాల కోసం దేవుని వాడుకోవద్దు. మతం, దేవుడి పేరును రాజకీయ వేదికల్లో వాడుకోవడం సరైనది కాదు. ప్రతి మనిషిలో దైవాన్ని చూడగలగాలి. ధర్మాన్ని పంచడమే మతం ముఖ్య ఉద్దేశం. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

### పాలకులు కళాకారులను ఆదుకోవాలి

**బంగారు మురళి, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

నిత్యం దైవ ప్రచారానికి పూనుకుని, సమాజంలో మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్న జానపద కళాకారులను పాలకులు ఆదుకోవాలి. కోట్లు సంపాదించే సినిమా వాళ్లకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వం, కళాకారులకు కనీసం ఆలయాల్లో భజనలు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడం దారుణం. అరాకొరా ఇచ్చిన అనేక షరతులు విధించడం సరైనది కాదు.

### పిల్లలకు భక్తిమార్గాన్ని నేర్పించాలి

**ఆంజనేయస్వామి, కాశీ అన్నపూర్ణస్వామి ఆశ్రయం నిర్వాహకులు**

చేయి చేయి కలిపితేనే శబ్దం వస్తుంది. అందరూ కలిసి ఆరాధన చేస్తే భక్తి భావం ప్రజ్వరిల్లుతుంది. పిల్లలకు భక్తిమార్గాన్ని నేర్పించాలి. భక్తితోనే ముక్తి వస్తుంది. భక్తిభావంతో సమాజంలో ఆధ్యాత్మిక భావాన్ని పెంచుదాం.

### ఉద్యమాలతో హక్కులు సాధిద్దాం :నూకరాజ్, కాకినాడ.



వ్యవస్థలను, పురాణాలను తిరగరాయలేం. సమాజాన్ని మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేద్దాం. హక్కులు అడుక్కుంటే రావు. ఉద్యమిస్తే సాధిస్తాం. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి కళాకారుల సమస్యలను పరిష్కరిద్దాం.

### కళాకారులను ఆదుకోవాలి : కళావతి, జయభారత్ సంస్థ

నిరంతరం శ్రమిస్తూ, మరోపక్క కుటుంబ పోషణ చూసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో పది మందికి మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్న జానపద కళాకారులను ఆదుకోవాలి. టిటిడి షరతులు లేకుండా ప్రతి కళాబృందానికి కనీసం ఏడాదికి ఒక్కసారైన అవకాశం కల్పించాలి. అందరూ ఐక్యంగా పోరాడి, కళాకారులకు అవకాశాలు సాధిద్దాం.

### టిటిడిలో అవకాశం ఇవ్వాలి

**భాస్కర్, గోవింద పిరామిడ్, తిరుపతి రూరల్.**

టిటిడి అనుబంధ ఆలయాల్లో సైతం కళాకారులు తమ కళా ప్రదర్శనలు చేసుకునేందుకు టిటిడి పెద్దలు ఆలోచించి అవకాశాలు ఇవ్వాలి. టిటిడి వంటి సంస్థ సామన్యుడి గురించి పట్టించుకోకపోవడం సరైనది కాదు. అందరూ కలిసి ఐక్యంగా పోరాడి, కళా ప్రదర్శనలకు కళాకారులకు అవకాశం ఇప్పిద్దాం.

# దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం**

దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తిరుపతి జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బరాయుడుతో కలిసి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రివర్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎంఎల్ఎలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. కలెక్టర్, ఎస్‌పిలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అభివృద్ధి, శాంతిభద్రతలను వివరించారు. మంత్రి మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి కొలువైన జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా తాను రావడం తన అదృష్టమని అన్నారు. విద్యుత్ సంబంధించి 6,400 కోట్ల భారం ప్రజలపై పెంచుతున్నారని అసత్యప్రచారం చేస్తున్నారని, విద్యుత్ ఛార్జీలు పెంచాలని ప్రభుత్వానికి లేదని, గతంలో 2015-19లో మిగులు విద్యుత్ ద్వారా ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించామని, గత ప్రభుత్వ పాలనలో నష్టాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

తిరుపతి జిల్లాలో పెన్షన్ల పంపిణీ బాగా జరుగుతోందని, ప్రతి పేదవానికి రూ.5 రూపాయలకే పట్టణ ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047తో ముందుకు వెళుతున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణా నివారించేందుకు పక్కాగా సిసి కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. తిరుపతి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. పులికాట్ సరస్సు ముఖ ద్వారం దగ్గర పూడిక తీత కార్యక్రమానికి చర్యలు తీసుకుంటామన్నారు. రిసార్ట్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వ ఐదు సంవత్సరాలలో ఫ్రీ హోల్డ్ పేరుతో పేదవారి భూములను అన్యాక్రాంతం చేసుకున్నారని మన తిరుపతి జిల్లాలో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా ఉన్నాయని, ఫ్రీ హోల్డ్ చేసిన భూముల రిజిస్ట్రేషన్ అయిన వాటి వెరిఫికేషన్ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు.గడువు మరొక 15 రోజులు పొడిగించి నవంబర్ 15 నాటికి సదరు అంశంపై నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రికి నివేదించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. సదరు ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగిన జిల్లాలలో తిరుపతి జిల్లా ఉన్నదని, వెరిఫికేషన్ ప్రక్రియ కొరకు ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లు ఈ పనిలో ఉన్నారని అన్నారు. అక్రమాలు జరిగిన వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చర్యలు తీసుకుంటామన్నారు.

### తిరుపతి అభివృద్ధిపై మంత్రి సమీక్ష

దొరవారిసత్రంలో...

**శ్రీవారి సేవలో...**

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు మంచి ప్రణాళికతో పున్ణనిర్మిస్తున్నారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించానన్నారు.

**జిల్లా ఇన్చార్జ్ మంత్రిని కలిసిన హరిప్రసాద్**

జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్చార్జ్ అనగాని సత్యప్రసాద్‌ను జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. కూటమి పార్టీల నాయకులతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, బిజెపి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇన్‌ఛార్జిమంత్రికి ఘన స్వాగతం**

**పెళ్లకూరు..** మండలంలోని చెంబేడు క్రాస్ రోడ్డు వద్ద తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి, రెవిన్యూ శాఖ మాత్యులు అనగానిసత్యప్రసాద్ ను సూళ్లూరుపేట నియోజకవర్గానికి విచ్చేయుచున్న సందర్భంగా పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ సంచి కష్ణయ్య ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో యుగంధర్, నరేంద్ర, సిద్ధిల్ నాయుడు, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో సూళ్లూరుపేట ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ నివాసానికి వెళుతుండగా మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు జయరయ్య, మైనార్టీ నాయకులు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు

# ముక్కంటి ఈవోగా బాపిరెడ్డి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఆర్డీవో బాపిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు ఇచ్చింది. ఆయన మరో రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలోని పెద్ద దేవాలయాల్లో శ్రీకాళహస్తి ఒకటి. ఏడాదికి 150 కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. రెవెన్యూ జాయింట్ కమిషనర్ స్థాయి కలిగిన అధికారులను ఇక్కడ ఈవోగా నియమించాలి. అయితే దేవాదాయ శాఖలో ఆ స్థాయి కలిగిన అధికారుల కొరత ఉన్నట్లుంది. పలు దేవాలయాలకు రెవెన్యూ శాఖ నుంచి నియామకాలు జరుగుతున్నాయి. ఆర్డీవో పై స్థాయి అధికారులను ఇక్కడ ఈవోగా నియమించాలి. ఆర్డిఓ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను ఈవోగా నియమించాల్సి ఉంటుంది. అయితే ఆర్డీవో స్థాయి అధికారి అయిన బాపిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఈవోగా నియమించింది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరాజు, రామారావు, నాగేశ్వరరావు లాంటి డిప్యూటీ కలెక్టర్లను ఈవోలుగా నియామకం చేసింది. అయితే పరిపాలన ఏమాత్రం గాడిన పడలేదు. దేవదాయ శాఖకు చెందిన కొందరు అదనపు బాధ్యతలు నిర్వహించినా పూర్తి స్థాయిలో విధులు నిర్వహించ లేకపోయారు. ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్ కొన్ని మార్పులు తీసుకొచ్చారు. పరిపాలనలో దూకుడు పెంచారు. అంతేగాకుండా ఆయన తీసుకున్న నిర్ణయాలు కొన్ని వివాదాస్పదంగా మారాయి. ఆలయానికి అత్యధిక ఆదాయం వస్తున్న రాహు కేతు పూజలపై ఆయన తీసుకున్న సంప్రదాయ వస్త్రధారణ తీవ్ర విమర్శలకు దారితీసింది. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు భక్తులను దోపిడీ చేస్తున్నారు. గత ఐదేళ్లుగా మూలన పడిన మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి. వివాదాల్లో ఉన్న దేవస్థానం ఆస్తులు, భూములకు పరిష్కారం చూపాలి. అయితే ఈవోలుగా వస్తున్న అధికారులు వీటిపై దష్టి పెట్టడం లేదు. కేవలం రాహుకేతు పూజల ఆదాయంపై మాత్రమే దష్టి పెడుతున్నారనే ఆరోపణ ఉంది. ఆలయానికి వస్తున్న భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించే కనీస బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. నాయకులది కూడా అదే తీరు. ఆలయానికి వచ్చిన భక్తులు సంతప్తితో తిరిగి వెళ్ళే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దళారుల దర్శనాలను పూర్తిగా నివారించ లేకపోతున్నారు. సిఫార్సు దర్శనాలలో పారదర్శకత లేదు. ప్రభుత్వం జూనియర్ ఐఏఎస్ అధికారిని నియామకం చేసి ఆలయ రూపు రేఖలు మారుస్తుందని భక్తులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయితే గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వమూ ఆర్డీవోను నియమించింది. ప్రకాశం జిల్లాకు చెందిన బాపిరెడ్డి నెల్లూరు జిల్లాలో ఎక్కువ కాలం పనిచేశారు. దేవస్థానం అధికారిగా ఆయన ఎంత మేరకు పనితనం చూపిస్తారో వేచి చూడాల్సిందే మరి.

### మళ్లీ ఆర్డీవో స్థాయి అధికారేనా..!

తిరుపతి నగరంలో గోడలపై సుందరమైన చిత్రాలు

# వైద్య పరీక్షల పేరిట దోపిడీ

## ప్రమాణాలు పాటించని డయాగ్నోస్టిక్ సెంటర్లు
## రెఫరల్ డాక్టర్లకు కమీషన్లు
## నియంత్రణ లేని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

**ప్రజాశక్తి - డక్కిలి**

వెంకటగిరి పట్టణ కేంద్రంలో ల్యాబులు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్లు నిబంధనలను పాటించడం లేదు. కనీసం ధరల సూచిక పట్టికలు ఉండటం లేదు. అనధికారికంగా కేంద్రాలను నడుపుతూ రోగుల వద్ద నుంచి లక్షల్లో దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు చిన్నపాటి జ్వరం, జలుబుతో ప్రైవేట్ క్లినిక్‌కు వెళితే పరీక్షల పేరుతో రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లకు అనుబంధంగా ల్యాబ్‌లు ఉంటున్నాయనేది, రిఫరల్ డాక్టర్లకు కమీషన్లు అందుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. కొందరు డాక్టర్లు విలువలకు తిలోదకాలు ఇవ్వడం వల్ల మొత్తం వైద్య వృత్తికే మచ్చగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ రోగం తగ్గదో, కుటుంబ సభ్యుని దక్కించుకోవాలన్న భయం వైద్యుల పాలిట కల్పవృక్షంగా మారింది. ఒకప్పుడు నెల్లూరు, తిరుపతి వంటి పెద్దపెద్ద పట్టణాలకే ఈ దోపిడీ పరిమితమయ్యేది. ప్రస్తుతం వెంకటగిరి వంటి పట్టణాలు, డక్కిలి, రాపూరు వంటి మండల కేంద్రాలకూ ఈ దోపిడీ పాకింది. ఫలితంగా డయాగ్నోస్టిక్ సెంటర్లు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయి. ఇక్కడ ఇంకో గమ్మత్తు ఏమంటే వైద్యులు సూచించిన డయాగ్నోస్టిక్ సెంటర్లోనే పరీక్షలు చేయించుకోవాలి. ఒక్కోచోట నిష్ణాతులైన టెక్నీషియన్లు లేనిచోట, వారిచ్చిన రిపోర్టు ఆధారంగానే వైద్యం చేసే పరిస్థితి ఉంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేవారు అర్హులై ఉండాలి, పారామెడికల్ బోర్డులో సభ్యులై ఉండాలి, అర్హులైన వైద్యులు దాన్ని ధృవీకరించాల్సి ఉంటుంది. లేనిచో ల్యాబ్‌లను సీజ్ చేసే అధికారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఉంటుంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా, వారూ అపుడపుడు తనిఖీలు నిర్వహించి 'మమా' అనిపించేస్తున్నారు.

## వేడుకగా హథీరామ్ బావాజీ బర్సీ మహోత్సవం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

హథీరామ్ బావాజీ బర్సీ 595వ మహోత్సవం వేడుకగా మంగళవారం జరిగింది. శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం సేవాగడ్ గుత్తి నుంచి ప్రారంభమై బంజారా తండాలన్నీ అఖండ జ్యోతితో పర్యటిస్తూ తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాం మఠంలో దర్శించి మహాభోగ్ బండరో హోమం నిర్వహించి సప్తగిరులపై వెలసిన బాలాజీ మందిరం పక్కన హథీరాం మఠంలో పూజలు నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణా, మహారాష్ట్రకు సంబంధించిన బంజారా భక్తులు, స్వాములు భక్తి శ్రద్ధలతో పాల్గొంటూ పూజలు నిర్వహిస్తారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బి.శివనాయక్ కిషోర్, శివ, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సుందర 'బొమ్మ'లతో 'స్వచ్ఛ తిరుపతి'

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

తిరుపతి సుందర నగరంగా రూపుదిద్దుకుంటోంది.. చిత్రకారుల 'సిత్రాలు' గోడలను అందంగా మార్చేస్తున్నాయి. మునుపు విచ్చల విడిగా బహిరంగంగా ఎక్కడ బడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తూ దృశ్యాలు కనిపించేవి. ఈ ప్రక్రియను రూపుమాపడానికి అధికారులు మూత్రశాలలు నిర్మించారు. బహరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే జరిమానాలు వేయబడతాయని గోడలపై రాతలు రాయించేవారు. అయితే కొందరు ఆకతాయిలు మూత్ర విసర్జన చేయరాదులో 'దు' అక్షరాన్ని చెరిపేసిన సందర్భాలు అనేకం. ఈ ప్రయత్నాల్లో 'మార్పు' కనిపించలేదని అధికారులు గుర్తించారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ తో నగరంలో నూతన శోభ ఉట్టిపడేలా అక్కడక్కడ మనిషికి అవసరమైన యోగా ఆసనాలు, సుందర దశ్యాలు, గోవింద నామాలు తిరుపతి నగరంలోని గోడలపై అధికారులు రాయించారు. ఇది కాస్త ఫలితాన్ని ఇవ్వడంతో తిరునగరిలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, యూనివర్శిటీ ప్రాంగణ ప్రహరీలు, ప్రసూతి హాస్పిటల్ ప్రహరీ, రూయా ఆసుపత్రి ప్రహరీ, రైల్వేకాలనీ మార్గం ఇలా అనేక చోట్ల శ్రీవారి రూపాలు, కవులు, శ్రీవారి వాహన సేవలకు సంబంధించిన చిత్రాలను తుడా అధికారులు చిత్రకారుల ద్వారా పెయింటింగ్ చేయించారు. దీంతో బహిరంగంగా మూత్ర విసర్జన దాదాపుగా తగ్గింది. మరోవైపు నగరపాలక సంస్థ కూడా స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో తిరుపతి కోర్టు ప్రాంగణాల వద్ద, ఎస్పీ ఆఫీసు ప్రహరీపై పెయింటింగ్ చేయించారు. నగర వాసులు, యాత్రికులలో మరింత మార్పు రావాలంటే ఇంకా కొన్ని చోట్ల ఇలా దేవతా మూర్తుల చిత్రాలు వేస్తే మంచి ఫలితాలను వస్తుంది అని పలువురు వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. గోవింద రాజుల స్వామి కోనేరు చుట్టూ వాహనాలు పార్కింగ్ చేయడంతో కోనేరు ప్రహరీపై మూత్ర విసర్జనలు చేస్తూ ఎంతో ఆధ్యాత్మికంగా ఉండాల్సిన ప్రాంగణం దుర్భరస్థితికి చేరింది. సుందర తిరునగరి కావాలంటే గతంలో పబ్లిక్ పాయింట్లలో మూత్ర విసర్జనశాలలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అంతంతమాత్రంగానే అవి కనిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు సమన్వయంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకొని అమలు చేయగలిగితే సుందర తిరుపతి సాధ్యమవుతుందని పలువురు సూచిస్తున్నారు.

# శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించండి

### సమీక్షా సమావేశంలో ఎంఎల్ఏ ఆరణి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

నగరంలో అక్రమ కట్టడాలు నివారించడానికి టౌన్ ప్లానింగ్ కషి చేయడమే కాకుండా, శెట్టిపల్లి భూ సమస్య వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగర అభివద్ధికి చేయాల్సిన పనులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్యతో కలసి అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలో ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న పనులు, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల గూర్చి, నగరంలో పన్నుల వసూళ్ళు, టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో నగర సుందరీకరణకు చేస్తున్న పనుల వివరాలను ఆయా విభాగాల అధికారులతో పాటు కమిషనర్ ఎన్.మౌర్య పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ఆస్తి పన్నులు 100 శాతం వసూలయ్యేలా చూడాలన్నారు . వినాయక సాగర్ దుర్గంధం రాకుండా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన పొరపాట్లను గుర్తించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

బాల నేస్తాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం

## 'బాల నేస్తాలు' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** కల్లివెట్టు పాఠశాల పిల్లల సృజనాత్మకతకు నిదర్శనం బాల నేస్తాలు కథా సంకలనం అని ఎంఈవోలు రవీంద్ర నాథ్, ముని సుబ్రహ్మణ్యం అన్నా రు. మంగళవారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన పాఠశాల తెలుగు పండితులు, రచయిత యువశ్రీ మురళి సంపాదకత్వంలో ముద్రించిన కల్లివెట్టు బడి పిల్లల కథా సంకలనం 'బాల నేస్తాలు'ను మండల విద్యాశాఖ అధికారులు ఆవిష్క రించి తొలి ప్రతిని బాల సాహితీవేత్త కృష్ణస్వామి రాజుకి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తుకు భాషా వారసులు ఈ బాల రచయితలని బాల సాహిత్య కథలు రాసిన విద్యార్థులను శాలువాలు, పుస్తకంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి..

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు చిన్నతనం నుండి సైన్స్‌పై అవగాహన పెంపొందించు కోవాలని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు అన్నారు. సంవత్సరం సైన్స్ టెకుముకి పోటీలు నిర్వహిస్తుంది గూడూ రు జెవివి నిర్వాహకులు వేగూరు రాజేంద్ర పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ చెకుముకి పోటీ మండల స్థాయి పరీక్షల్లో విజేతలైన విద్యార్థినీవిద్యార్థులకు జెవివి సభ్యులు మంగళవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వేగూరు రాజేంద్ర మాట్లాడుతూ సైన్స్ ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇంకా మూఢనమ్మకాలు పూర్తి స్థాయిలో నివారణ కాలేదని అన్నారు. మూఢ నమ్మకంతో చనిపోయిన వారు బతికి వస్తారని తల్లిదండ్రులు తమ ఇద్దరు బిడ్డలను చంపేశారని గుర్తు చేశారు. చిన్నతనం నుండి సైన్స్‌పై అవగాహన పెంపొందించేందుకు జెవివి ప్రతి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తుందని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో గూడూరు విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నారాయణ, నాగరాజు, సుమన్ రెడ్డి, శ్రీనివాసాచారి, చెంచు నారాయణ, గోపి పాల్గొన్నారు.

జ్ఞాపికలు పొందిన చెకుముకి పోటీల విజేతలు

## సిసి రోడ్డు పనులు తనిఖీ

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** ఏర్పేడు మండలంలోని మడిబాక పంచాయతీ హరిజనవాడలో నిర్మాణమవుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను డ్వామా సంచాలకులు సి.వి శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డ్వామా పథక సంచాలకులు మాట్లాడుతూ మండలంలో మంజూరు అయిన రూ.2 కోట్ల సిమెంట్ రోడ్లు, సిమెంట్ కాలువల పనులను త్వరిత గతిన పూర్తి చేసి సువర్ణ గ్రామ పంచాయతీలుగా రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి డి చంద్ర శేఖర్ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్ కుమార్, ఏర్పేడు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు రాయపనేని మల్లికార్జున్ నాయుడు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో గూడూరు సాయి ఎన్ క్లేవ్‌లో మంగళవారం పలు రకాల యాపిల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, సీనియర్ ఆడిటర్ శ్రీకంఠ రామ్మోహన్ రావు, పీఎం రావు, కృష్ణమరాజు , వాసు, బాల సుబ్రహ్మణ్యం, బాలరామి రెడ్డి, గోగుల వెంకట కృష్ణ రెడ్డి, నాగులు , గిరిబాబు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ 'క్లీన్లీ డ్రైవ్'

**ప్రజాశక్తి - క్యాంపస్:** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన 'దీపావళి కా భారత్'లో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో యూనిట్లు 2, 19 ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి అన్నమయ్య సర్కిల్‌లోని రైతు బజారులో ఎన్ఎస్ఎస్ క్లీన్లీ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా శుభ్రతను ప్రోత్సహించడం, ప్రజలను ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాముల చేయించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. రైతు బజార్ అధికారుల మద్దతుతో మార్కెట్ ప్రాంతం శుభ్రతతో మెరుగుపడడమే కాకుండా, స్థానిక సమాజంలో శుభ్రత, పౌర బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం విద్యావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వి భార్గవి రెడ్డి, వై సునీత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## 'ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం'

**ప్రజాశక్తి - క్యాంపస్:** విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం అని మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ సాయి సుజాత పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో తుమ్మలగుంట ప్రాథమిక పాఠశాలలో లీగల్ రైట్స్ పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య డి సాయి సుజాత మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు, వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. న్యాయ విభాగపు అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్ విక్టోరియా మాట్లాడుతూ ప్రాథమిక విధులు, విద్యా హక్కు చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ పి సునీత మాట్లాడుతూ బాలికల విద్య ఆవశ్యకత గురించి వివరించారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు గురించి విద్యార్థులకు అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి భారతి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట దిగుబడిపై అవగాహన

**ప్రజాశక్తి -కోట:** పంట దిగుబడిపై వ్యవసాయాధికారులు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కోట మండలంలోని జరుగుమల్లి, తిమ్మనాయుడుపాలెం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఒక ఎకరా ప్రధాన పొలానికి ఐదు సెంట్లు నారుమడి ఏర్పాటు చేసుకొని రెండు కేజీ నత్రజని(యూరియా) భరేమీందు ఒక కేజీ విత్తనం, పత్తిని పదిహేను రోజులు ముందు మరొక ఒక కేజీ, ఒక కేజీ భాస్వరం, ఒక కేజీ పొటాష్ నిచ్చే ఎరువులు దుక్కిలో వేయాలని తెలిపారు. జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చెయ్యాలన్నారు. పత్తిని పది రోజులకు కార్బోఫ్యూరాన్ మూడు గ్రాముల గుళికలు సెంట్ నారుమడికి నూట అరవై గ్రాముల (లేదా) నారు తీయడానికి ఏడు రోజులు ముందు ఒక సెంటు నారు మడికి నూట అరవై గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలని రైతులకు అవగాహన కల్పించారు.

# 1 నుండి 'ఏపిఆర్ సెట్ 2023-24' మలివిడత అడ్మిషన్లు

**ప్రజాశక్తి - క్యాంపస్:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపిఆర్ సెట్ 2023-24 లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు మలివిడత పిహెచ్‌డి అడ్మిషన్ల ప్రక్రియ నవంబర్ ఒకటవ తేదీ నుంచి ప్రారంభమవుతుందని కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో నిర్వహించిన అడ్జైరి కమిటీ సమావేశానంతరం ఎపి ఆర్ సెట్ 2023-24 ఛైర్మన్ ఆచార్య కె రామ్మోహన్ రావు, కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని 17 విశ్వవిద్యాలయాల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో పిహెచ్‌డి (పార్ట్ టైం, ఫుల్ టైం) 2,566 సీట్లకు మొదటి దశలో 2005 మందికి సీట్ల కేటాయింపు పూర్తయిందని తెలిపారు. అయితే మొదటి దశలో సీట్లు పొందిన వారిలో 1,672 మంది వివిధ విశ్వవిద్యాలయాల్లో రిపోర్టు చేశారని, తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన 894 పిహెచ్‌డి సీట్లకు మలివిడత అడ్మిషన్ల ప్రక్రియ నవంబర్ 1 నుంచి మొదలవుతుందని తెలిపారు. తొలి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవలసిన అవసరం లేదని, ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం మలివిడత అడ్మిషన్ల ద్వారా లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 'హెచ్‌టిటిపిఎస్://సెట్స్ ఏపీఎస్‌సిహెచ్ఇ. ఏపీ.జీవీ.ఐఎన్/ఏపీఎస్‌సిహెచ్ఇ/ఏపీఎస్‌సిహెచ్ఇ హోమ్.ఎపిఆర్ఎక్స్' వెబ్‌సైటును చూడాలని కోరారు.

# లైసెన్స్ లేకుంటే కఠిన చర్యలు

డ్రైవర్లకు ఎంవిఐ హెచ్చరిక

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ రావు హెచ్చరించారు. గూడూరు ఆర్‌టిఓ ఇన్‌ఛార్జ్ సమీపంలో గూడూరు రోడ్డు రవాణా సంస్థ అధికారులు మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. గూడూరు పట్టణంలోని ఆర్టీఓ ఇన్‌ఛార్జ్ సమీపంలో రోడ్డు రవాణా సంస్థ అధికారులు వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా, చలానాలు విధించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా డ్రైవింగ్ లైసెన్స్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎంవిఐ ప్రభాకర్‌రావు

## బాధితులందరికీ నష్టపరిహారం: తహశీల్దారు

**ప్రజాశక్తి -కోట:** సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా అర్హులైన బాధితులందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కోట స్థానిక తహశీల్దారు కఠారి జయరాం అన్నారు. మంగళవారం కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం కొంత భూమిని రైతుల భూమి సర్వేలో కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆయా రైతులకు మాత్రం పలు కారణాల వల్ల పరిహారం అందలేదు. కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాలు మేరకు స్థానిక తహశీల్దారు జె జె రావు నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చేరుకుని పంచాయతీ కార్యాలయంలో ఎపిఆ అర్జులు.. అర్హులు వున్నారో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులంద రికీ న్యాయం చేస్తామని తెలిపా రు. ప్రస్తుతం కొనసాగుతున్న సాగర మాల రోడ్డు పనులకు ఎలాంటి ఆటంకాలు కలిగించ కూడదని రైతులకు సూచించారు. రైతుల భూములకు ఆధారాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కోట తహశీల్దారు జె జె రావు, వాకాడు తహశీల్దారు రమయ్య, సాగరమాల అధికారులు ప్రసాద్, టిడిపి నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి, ఎంపిటిసి నారాయణ, నేదురుమల్లి ప్రవీణ్ రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్ రెడ్డి, స్థానిక సర్వేయర్, విఆర్‌వో వెంకట రమణయ్య, రైతులు పాల్గొన్నారు.


రైతుల భూముల వివరాలు తెలుసుకుంటున్న తహశీల్దారు కఠారి జయరాం

# జాబ్ మేళాకు విశేష స్పందన

- 67 మందికి ఉద్యోగావకాశాలు
- హిమజ కళాశాల ఛైర్మన్ సురేంద్ర రాజు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా స్థానిక హిమజ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ఆ కళాశాల ఛైర్మన్ సురేంద్ర రాజు, ప్రిన్సిపాల్ ఎస్ లోకనాథంలు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఆరు బహుళ జాతీయ సంస్థల వారు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10, ఇంటర్, డిగ్రీ పాస్, పెయిల్, బిటెక్ చదివిన 18 నుండి 32 ఏళ్ల వయస్సుగల స్త్రీ, పురుషులు 138 మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో 67 మంది ఉద్యోగాలకు ఎంపిక య్యారు. ఈ జాబ్ మేళాలో ప్రిన్సిపాల్ పురుషోత్తం రాజు, ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా ప్లేస్ మెంట్ అధికారి చైతన్య, కళాశాల కో ఆర్డినేటర్ ఎస్. అఫ్రిన్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ రసూల్, అబ్దుల్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

## 'పోలీసు అమరవీరుల సేవలు అమోఘం'

**ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి):** పోలీస్ అమరవీరుల సేవలు అమోఘమని వారికి అందరం రుణపడి ఉన్నామని కళ్యాణి డ్యామ్ వద్ద ఉన్న పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కే సుబ్రమణ్యం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా మంగళవారం పోలీసు శిక్షణ కళాశాలలో సభ ఏర్పాటు చేశారు. ముందు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సీఐలు ఏ నిరంజన్ కుమార్, యు సదాశివయ్య, మధుసూదన్ రెడ్డి ఎస్సైలు ఎస్ వెంకటరమణ, జి బిన్ని రెడ్డయ్య, కె అశ్విని, ఆర్ ఎ శివశంకర్, వి చలపతి , ఆర్ఎస్ఐ వెంక టు రక్తదానం చేశారు.వైద్య శిబిరంలో 63 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సాహసోపేతంగా పోరాడి మృతి చెందిన పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు అన్ని విధాల అండదండలు అందించడం మన బాధ్యత అన్నారు. అమరవీరులకు సేవలను కొనియాడారు. అమరవీరుల ఆదర్శమూర్తులని వారి త్యాగం ఎప్పటికీ వృథాగా పోదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు పలువురు పోలీస్అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న పోలీసులు

# 'యువతరంగ్ - 24' పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - క్యాంపస్:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నవంబర్ 8,9 ,10 తారీకులలో జరిగినటువంటి సాంస్కృతిక పండుగ "యువతరంగ్ - 24"కు వర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా అధికారుల చేతుల మీదుగా శ్రీకారం చుట్టించారు. జిల్లా ఇన్‌ఛార్జ్, రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా "యువతరంగ్ - 24" గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పట్ల మక్కువచూపాలని తద్వారా విద్యార్థులు సంపూర్ణమైన పరిపూర్ణత సాధిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, పరిశోధకులు నాదముని, రాజశేఖర్ పాల్గొన్నారు.

యువతరంగ్ -24 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

## నేడు మున్సిపల్ సమావేశం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం ఆఫీసు సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం నూతన భవనంలో సమావేశ మందిరంలో ఛైర్మన్ అనంగి హరి, వైస్ ఛైర్మన్లు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ ఎం మంజునాథ్ గౌడ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ నెంబర్లు, హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

## వృత్తి నైపుణ్యంతో ఉపాధి

**ప్రజాశక్తి -వరదయ్యపాలెం:** విద్యార్థులు విద్యతో పాటు, వృత్తి విద్యలో నైపుణ్యం సాధిస్తే ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఎం జె పి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య అభిప్రాయపడ్డారు. సోమవారం ఎం జె పి గురుకుల పాఠశాల పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఆదికారిక ఇంజనీరింగ్ కళాశాల లోని పలు బ్రాంచ్ లైన కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ట్రిబుల్ ఈ, వంటి మెకానిజల్, సివిల్ ఈ ల్యాబ్ పరికరాలపై వాటి ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి జీవితంలో బాగా ఆర్థికంగా స్థిరపడడానికి, ఉపాధి అవకా శాలు పొందడానికి వారిలో ఉన్న నైపుణ్యతను పదును పెట్టి, వృత్తి, సాంకేతిక వంటి వాటిలో రాణించడానికి అవగాహన పెంచు కోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్ర మంలో వృత్తి విద్య ఉపాధ్యాయు రాలుసిహెచ్ అమల, బిబి రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

# క్రైం న్యూస్

## లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పలమనేరు జిల్లా పెద్దాపురంలో మండలానికి చెందిన షేక్ హుస్సేన్ (60) మంచాలకు నవార్లు అల్లిస్తూ ఉండేవాడు. వ్యాపారం నిమిత్తం రేణిగుంట నుంచి పుత్తూరు, నగరి వైపు మోటార్ సైకిల్ పై బయలుదేరి ఉదయం తడుకు వరకు వస్తుండగా హర్యానా నుండి లారీ చెన్నైకి వెళుతూ ముందు వెళుతున్న మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్ లారీ కిందికి దూసుకుపోయింది. కాలు విరిగిపోయి, శరీరం మొత్తం లారీ చక్రం కింద ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు షేక్ హుస్సేన్ మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సిసి రోడ్డు వివాదం

### తల్లీకొడుకులకు గాయాలు

**ప్రజాశక్తి -శ్రీకాళహస్తి:** సిమెంట్ రోడ్డు నిర్మాణంలో ఏర్పడ్డ ఓ వివాదంలో తల్లీకొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం తొట్టంబేడు మండలంలోని కల్లిపూడి దళితవాడలో చోటు చేసుకుంది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కల్లిపూడి దళితవాడలో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే నాగూరయ్య తన ఇల్లు సీసీ రోడ్డు కారణంగా వర్షాకాలం సమయంలో మునుపుకకు గురవుతుందన్న ఆందోళనతో నిర్మాణాన్ని అడ్డుకున్నాడు. దీంతో వివాదం చెలరేగి రమణయ్య కుటుంబం నాగూరయ్య కుటుంబంపై దాడికి దిగింది. ఈ దాడిలో కుక్కా నాగూరయ్య(42), ఆయన తల్లి పోలమ్మ(75)లు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన పూర్వాపరాలను పరిశీలిస్తున్నారు.

## జయరామ్ రెడ్డికి నివాళి

మేరీని ఓదారుస్తున్న రోజా

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** నిండ్ర మండల కేంద్రం నిండ్ర గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకురాలు, వైసిపి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మేరీ భర్త జయరామ్ రెడ్డి గుండె పోటుతో హఠాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా నిండ్రలోని వారి ఇంటికి వెళ్లి జయరామ్ రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి మేరీని, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రజా ప్రతినిధులు, పార్టీ కన్వీనర్, వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యా సామర్థ్యాలు పెంచుకోవాలి : ఎంఈవో

**ప్రజాశక్తి -కోట:** ప్రతి విద్యార్థి వ్యక్తి గతంగా వారి వ్యక్తిగత విద్యా సామర్థ్యాలను పెంచుకోవాలని ఎంఈవో దారా మస్తానయ్య పేర్కొన్నారు. మంగళవారం కోట మండలంలోని తిన్నెలపూడిలోని ఎంపియుపి పాఠశాలలో ఎంఈఓ దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని, ప్రస్తుతం 'మనబడి మన భవిష్యత్తు' లో భాగంగా పాఠశాల నిర్మాణం, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెంగయ్య పాల్గొన్నారు.

## 'ఉచిత గ్యాస్'ను సద్వినియోగం చేసుకోవాలి

- తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం తీసుకొచ్చిందని ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి , మాజీ మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని గుమ్మ పాలెంలో ఉచిత గ్యాస్ పథకంపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు ఇస్తామని ప్రకటించారని దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్‌ను ఇస్తున్నారని అర్హులైన ప్రతి ఒక్కరూ గ్యాస్‌ను బుక్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట స్థానిక మహిళ నాయకులు , మహిళలు పాల్గొన్నారు.

## 'అత్యాచారాలు అడ్డుకోవడంలో విఫలం'

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడంలో పాలక ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా తిరుపతి జిల్లా అధ్యక్షురాలు జి భారతి అన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జి భారతి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ఓ వైద్యురాలుపై జరిగిన దారుణ అత్యాచారమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సంఘటన యావత్ భారతదేశాన్ని కుదిపేసిందన్నారు. దేశంలో సగభాగంగా ఉన్న మహిళలకు నేడు రక్షణ కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ సమావేశంలో స్వర్ణ, కోకి, కల్యాణి, శాంత కుమారి, మణి శ్రీ , సురేఖ, సురాజ్ లక్ష్మి మోహన్ రాణి, తనూజ, జహీరా, పార్వతి, మణెమ్మ, సుభాషిణి పాల్గొన్నారు.

## మంత్రి సత్య ప్రసాద్‌ను కలిసిన గిరిబాబు

**ప్రజాశక్తి -తిరుపతి డెస్క్:** తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నాగాలమ్మరం మండల టిడిపి అధ్యక్షుడు పి గిరిబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం కస్టర్ ఇన్‌ఛార్జి పృష్ణంగం ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గతంలో భూమి పూజ చేసి ధర్మరాజుల స్వామి గుడి చెంత మత్తం పునర్నిర్మాణ కార్యక్రమాన్ని వెంటనే పునర్నిర్మాణం చేయాలని విన్నవించుకున్నారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించారు.

## పేరుకుపోతున్న చెత్తకుప్పలు

- పాఠశాల ఆవరణలో దుర్వాసన - విద్యార్థుల ఇబ్బంది

**ప్రజాశక్తి- తిరుపతి డెస్క్:** ఏర్పేడు మండలం పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వెళ్లే మార్గం పక్కనే స్కూలు ప్రహరీ సమీపాన కాలువ అంచున దుకాణ దారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను, వ్యర్థాలను వేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు పడినప్పుడు కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఏర్పడి దుర్వాసనగా మారి దోమలు ఏర్పడి పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారుతోంది. పాఠశాలకు వెళ్లే వచ్చే విద్యార్థులు దుర్వాసనను భరించలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ చెత్తను వేస్తున్న దుకాణ దారులను అడ్డుకోవాలని పాఠశాల ఆవరణలో చెత్తను తీసివేయాలని కో రుతున్నారు.

# చంద్రగిరి అన్ని విధాలా అభివృద్ధి: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్):** డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి పరుగులు పెట్టనుందని ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎంపీ దగ్గుబాటి ప్రసాద్ రావు అన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లి సమీపంలో రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని చిత్తూరు ఎంపీ దగ్గుబాటి ప్రసాదరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని సందర్శించి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి ఎంపీ పరిశీలించారు. కొంత సమయం చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. చంద్రగిరి నియోజక వర్గంలో యువకుల పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగావకాశాలు కల్పనకు ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ పాలన లో చంద్రగిరి అభివృద్ధి కుంటుపడి ఉందని, యువతకు ఉద్యోగ భరోసా కల్పించలేదన్నారు. నియోజక వర్గంలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటి ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మంచి భవిష్యత్తు అందించవచ్చన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిని అన్ని విధాలా అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. అందిస్తున్న సహకారంతో అభివృద్ధి చేస్తామని ఇప్పటికే పరిశీలించామని త్వరలో పరిశ్రమల ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. చంద్రగిరి అభివృద్ధికి కేంద్ర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించే బాధ్యత ఇద్దరం తీసుకుంటామన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యేను కలిసిన ఎంపి

## పరసాకు బొజ్జల పరామర్శ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి పరసా రత్నంను మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పరసా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి అభివృద్ధి, రాజకీయాలపై చర్చించారు. బొజ్జలతో పాటు మంత్రి సత్య ప్రసాద్ కూడా ఉన్నారు. అంతకుముందు బొజ్జల మంత్రి అనగానితో కలిసి తిరుమల వెంకన్నను, కాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు.

**రామచంద్రాపురం (తిరుపతి రూరల్):** మాజీ మంత్రి పరసారత్నం గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడన్న విషయం పులివర్తి నాని ద్వారా తెలుసుకున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి ఆయనను పరామర్శించారు. మంగళవారం తిరుపతి పర్యటనలో ఉన్న మంత్రి చంద్రగిరి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి పరసారత్నం ను ఆయన స్వగృహంలో పరామ ర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి వారితో కలిసి స్వ బాలాజీ కాలనీలోని స్వగృహంలో ఆయనను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

## భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):** గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తు న్నామని, గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దారు శివరాం సుబ్బయ్య అన్నారు. మంగళ వారం మండలంలోని శేషాపురంలో తహశీల్దారు అధ్యక్షతన రీ సర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో భూ సమస్యలపై 37 ఫిర్యాదు లు అందినట్లు తహశీల్దార్ శివరాం సుబ్బయ్య తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ అధికారులు కోరగా రైతులు మ్యుటేషన్, భూ విస్తీర్ణం కరెక్షన్, పట్టా సబ్ డివిజన్ పై రైతుల నుండి ఫిర్యాదులు రెవెన్యూ అధికారులు స్వీకరించారు. వాటిని ఆన్లైన్ నమోదు చేసి ఫిర్యాదుదారులకు రసీదును అందించా రు. భూ సమస్యలకు సంబంధించి త్వరితగతిన పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరయ్య, మండల సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వో, సచివాలయం, రైతులు పాల్గొన్నారు.


సభలో 37 ఫిర్యాదులు

**IN THE OF THE 10 ADDL., DISTRICT JUDGE OF TIRUPATI**
**I.A.No.59/2023**
**A.S.No. 52 of 2023**
**O.S.NO.826 OF 2019**

**Between:**
Srirama Srinivasulu Naidu and another ...Appellant

**And:**
Y.S.Rama Devi ...Respondent

**APPEAL NOTICE TO RESPONDENT**

To
Y.S.Rama Devi, D/o Y.Subash, D.No.302, 3rd Floor, KNR Apartments, New Balaji Colony, Tirupati Town & Dt.,

**Madam,**
It is hereby brought to your notice that the above named appellants filed the above appeal challenging the judgment of the lower court in O.S. No.826/2019 in respect of the suit schedule properties. The said appeal is posted for your appearance on 6.11.2024, so that you are hereby ordered to appear before the Court on 6.11.2024 at about 10.30 A.M. either in person or through pleader and answer the said suit failing which the matter will be heard and determined in your absence.

(B.O.)
**Sd/-C.K. RAGHU**
Advocate for Appellant

## విశ్వం స్కూల్లో ఘనంగా లక్ష్మి ధన్వంతరి హోమం

**ప్రజాశక్తి - క్యాంపస్**

ధన త్రయోదశి, జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక వరదరాజ నగర్ విశ్వం టాలెంట్ స్కూల్ నందు పార్థ ఆయుర్వేదిక్ హాస్పిటల్, సంస్కార్ ఫౌండేషన్, ది ఆయుర్వేదిక్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీగా ధన్వంతరి హోమం నిర్వహించారు. దాదాపు 300 రకాల మూలికలను ప్రదర్శనగా ఉంచి, 108 మూలికల తో పూర్ణాహుతి నిర్వహించారు. ధన్వంతరి విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయుర్వేద డాక్టర్స్, సంస్కార్ ఫౌండేషన్ సభ్యులు ఎంఎల్సి సిపాయి సుబ్రమణ్యంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పార్థసారథి, సంస్కార్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజేష్, సతీష్, విశ్వం విద్యా సంస్థల ఛైర్మన్ డా.ఎన్.విశ్వనాథ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథ్, విశ్వ చందన్ రెడ్డి, రమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ధన్వంతరి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ ఆర్జే రమాశ్రీ పాల్గొన్నారు. బి.బాల దత్తాత్రేయ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ ఎన్.లత పాల్గొన్నారు.

## 'స్థల వివాదంతో దళితుల మధ్య చిచ్చు'

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

రేణిగుంట మండలం జీ పాలెంకు చెందిన స్టార్ కష్ణ కొనుగోలు చేసిన స్థలంకు సంబంధించి రోడ్డు మార్గాన్ని చూపకపోవడంతో తలెత్తిన వివాదంలోకి వేరొక గ్రామానికి చెందిన దళితులను ఉసిగొల్పడం విడ్డూరంగా ఉందని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. వెంకటేష్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం కల్లూరు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి నుండి స్టార్ కష్ణ భూమిని కొనుగోలు చేశారన్నారు. అయితే కొనుగోలు సమయంలో రోడ్డు మార్గం నిర్దేశకాన్ని తప్పుగా చూపించి, నేడు కొనుగోలు చేసిన స్థలంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు రావడంతో భూమిని కోల్పోతున్నారని, నష్టపరిహారం చెల్లించాలని కోరడంతో వివాదం తలెత్తిందన్నారు. నష్టపరిహారం చెల్లించకపోగా వడమాల పేటకు సంబంధించిన దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని స్టార్ కష్ణపై ఉసిగొలిపి, మీడియా ద్వారా జరగని విషయాలను ప్రచారం చేయడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి స్థల వివాదంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గురవమ్మ, జయంత్ బాబు, శ్రీకాంత్, చలపతి, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులు నేలకు జీవం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

సేంద్రియ ఎరువులు భూమికి జవ జీవాలను ఇస్తాయని వ్యవసాయ శాఖ వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. తొట్టంబేడు మండలం మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ప్రకతి వ్యవసాయం పైన రైతులకు శిక్షణ ఇచ్చారు. సేంద్రియ ఎరువులు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. పచ్చిరొట్ట పైర్ల సాగు, విరివిగా పశువుల ఎరువులు వాడకం, జీవామతం వినియోగం, భూమిలో సేంద్రీయ పదార్థాన్ని పెంచుతాయని తెలిపారు. పొలాలకు అధికంగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల చీడపీడలు అధికమై భూమి భూగర్భ జలాలు కలుషితమవుతాయని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది మల్లికార్జున, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు

# రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చాలి

**శ్రీసిటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి**
**నూతన పారిశ్రామిక విధానం 4.0పై వివరణ**

**ప్రజాశక్తి - వరదయ్యపాలెం**

నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంలో భాగస్వాములు కావాలంటూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖా మంత్రి టి.జి.భరత్ శ్రీసిటీలోని పరిశ్రమల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీసిటీలో పరిశ్రమల ప్రధాన కార్యనిర్వాహకులు (సీఈఓలు), ఇతర ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం-4.0 తీరు తెన్నుల గురించి వివరించారు. నూతన పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విధానంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఈ), ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి, పర్యావరణ హరిత శక్తి, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దష్టి పెట్టామని వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ మాట్లాడుతూ 'వేగవంతమైన వ్యాపార విధానం' కోసం తీసుకువస్తున్న వివిధ నిర్ణయాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పరిశ్రమల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల స్థాపన, అభివద్ధి, రంగాలవారీగా ప్రోత్సాహకాలతో కూడిన కార్యక్రమాల గురించి వివరించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగాలను సష్టించడం, ఆర్థిక వద్ధిని పెంచడం రాష్ట్రం లక్ష్యంలో భాగంగా వివరించారు. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో రాష్ట్రంలో 175 ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక పార్కులు, ఎమ్మెస్ ఎం ఇ, ఎలక్ట్రానిక్స్ కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ కల్పన, సుస్థిర వద్ధిని సాధించడం ప్రభుత్వ లక్ష్యంలో భాగమన్నారు.

# సమీరా వచ్చేస్తున్నానంటూ...

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

'సమీరా వచ్చేస్తున్నా..ఇంకో 15 నిమిషాల్లో నీ ముందుంటా.. కంగారు పడొద్దు.. బాబు తిన్నాడా..! నువ్వూ భోజనం చేసి పడుకో..ఐ యామ్ ఆన్ ది వే' అన్న భర్త తెల్లారే సరికి విగతజీవిగా దర్శనమిచ్చాడు. కట్టుకున్న భార్యకు పుట్టెడు దు:ఖాన్ని మిగిల్చాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాదకర ఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం రామానాయుడు ఎస్టీ కాలనీ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. బుచ్చినాయుడుకండ్రిగ మండలం జోగికండ్రిగకు చెందిన కొప్పల ధర్మయ్య కుమారుడు కొప్పల నారాయణ(25) డిగ్రీ వరకు చదివి రౌతు సూరమాల సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నారాయణకు పెళ్ళకూరు మండలం నెలబల్లి దళిత వాడకు చెందిన సమీరాతో ఏడాదిన్నర కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భార్య సమీరా కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్ళింది. ఆమెను చూసేందుకు నారాయణ రెండు రోజుల కిందట నెలబల్లి వెళ్లాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్ళాడు. తిరిగి వస్తూ తన మేనత్త ఊరైన తాటిపర్తికి చేరుకున్నాడు. రాత్రి పదవుతున్నా నారాయణ ఇంటికి రాకపోవడంతో సమీరా భర్తకు ఫోన్ చేసింది. ఎక్కడున్నావంటూ ఆరా తీయడంతో తాటిపర్తిలో ఉన్నాననీ, మరో 15 నిమిషాల్లో మీ ముందుంటాననీ, కంగారు పడొద్దని నారాయణ సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో నెలబల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో నాయుడు పేట-మదనపల్లి జాతీయ రహదారికి అతి సమీపంలో రామానాయుడు ఎస్టి కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బండ రాయిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నారాయణ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బండరాయిని ఢీకొట్టిన సమయంలో నారాయణ బైక్ తోపాటు ముళ్లపొదల్లో పడిపోవడంతో అటుగా వెళ్లిన వాహనదారులకెవరికి కనిపించని పరిస్థితి. ఇప్పుడే వస్తున్నానన్న భర్త తెల్లారైనా ఇంటికి చేరకపోవడంతో సమీరా తాటిపర్తిలోని తమ బంధువులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు ఆరా తీయగా ముళ్లపొదల్లో విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి నిర్ఘాంతపోయారు. సమాచారం అందుకున్న తొట్టంబేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

## ఉత్సాహంగా 'ఉల్లాస్' : డిఆర్డిఎ పీడి శోభన్ బాబు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

జిల్లా పరిధిలో మహిళలు 100 శాతం అక్షరాస్యత కల్పించేలా తయారు చేసిన ఉల్లాస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని డిఆర్డీఏ పీడి శోభన్ బాబు సూచించారు. మంగళవారం డిఆర్డిఏ సమావేశ మందిరంలో వయోజన విద్య, ఎంపిడీఓలు, (సెర్ప్) ఏపియంలకు ఒక్కరోజు శిక్షణ తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పీడి శోభన్ బాబు మాట్లాడుతూ ఈ ఉల్లాస్ కార్యక్రమం 1990లోనే రూపుదిద్దుకుందన్నారు. నవంబర్ 2వ తేది నుండి 2025 మార్చి నెలాఖరు వరకు ఈ ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయబడుతుందని, ఇప్పటికే ఎంపిక చేయబడ్డ 12,085 మందికి అంగన్వాడీ, ఐసిడిఎస్ సెంటర్లు, కమ్యూనిటీ హాల్లు, సచివాలయాల్లో సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. 2030 నాటికి పూర్తిస్థాయి అక్షరాభ్యాసం నమోదు అవ్వాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ప్రసాద్, డిపిఎంహెచ్ఎ విజయ, ఎపియం ఉమాదేవి పాల్గొన్నారు.

## 'ఆదర్శ' అధ్యాపకులు మోహనమూర్తి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

ఆదర్శ భావాల అధ్యాపకులు మోహనమూర్తి అని మాజీ ఎంఎల్సి విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. బాలాజీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల ఇంగ్లీష్ విభాగ అధిపతి పి.మోహనమూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమం ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పి.మోహనమూర్తి ఆదర్శ భావాలు గల అధ్యాపకులని, సామాన్య కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా హైస్కూల్ ఉపాధ్యాయులుగా, జూనియర్ కళాశాల అధ్యాపకులుగా, ప్రస్తుతం ఇంగ్లీష్ హెచ్ఒడి స్థాయికి ఎదిగారన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం ఆయనదన్నారు. వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మంచి స్నేహ స్వభావంతో 34 సంవత్సరాలు సర్వీసు చేశారని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కరుడు, సిఐటియు నాయకులు కందారపు మురళి, వి.నాగరాజు, మున్సిపల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కెవిల్ వర్మ పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్సు ఉద్యోగులతో ఎస్పీ శ్రీనివాస్ 'దర్బార్'

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు ఉద్యోగులతో టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మంగళవారం దర్బార్ నిర్వహించారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాలతో ఎస్పీ దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు, టాస్క్ ఫోర్సు సబ్ కంట్రోల్ కార్యాలయాలు కడప, సానిపాయ, రైల్వే కోడూరు సిబ్బంది జూమ్ ద్వారా దర్బార్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పీ శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు గురించి వివరించారు. ఉద్యోగులు పొరబాట్లకు తావు లేకుండా, ఏ విధంగా విధులు నిర్వహించాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. అరుదైన ఎర్రచందనాన్ని శేషాచలం అడవుల్లో సంరక్షించడం ఉద్యోగుల బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ బాలిరెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## 'మా భూములు కాపాడండి'

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి** అధికారం అండ చూసుకుని కొందరు సాగిస్తున్న ఆక్రమణల నుంచి మా భూములను కాపాడాలంటూ తొట్టంబేడు మండలంలోని కాసరం రైతులు మంగళవారం తహశీల్దార్ మధుసూదన్ రావు కు విన్నవించారు. 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కాసరం నిరుపేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో ఒకొక్కరికి ఎకరం చొప్పున భూ పంపిణీ చేశారన్నారు. అయితే సోమవారం ఆ భూముల్లో శివమ్మ అనే మహిళ దౌర్జన్యంగా దున్నకాలు చేపట్టిందని వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.